# మరో ఆరు రోజులే గడువు..

- కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం
- ఇప్పటికే ఓటరు తుది జాబితా విడుదల
- ముథోల్ నియోజకవర్గంలో ఓటర్లు 2,46,030



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్, ఏఎస్పీ, అధికారులు (ఫైల్)

భైంసా, అక్టోబర్ 25 : కొత్తగా ఓటరు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 4న ఓటరు జాబితాను ప్రకటించారు. 9న అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. షెడ్యూల్ వచ్చిన కొత్త ఓటరు నమోదుకు చివరిగా ఈ నెల 31వ తేదీ వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఫారం –6 ద్వారా కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. నవంబర్ 30 న తెలంగాణలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని యంత్రాంగం సెప్టెంబర్ 19 వరకు ఓటరు నమోదు మార్పులు, చేర్పులకు అవకాశం ఇచ్చింది. దరఖాస్తులన్నీంటిని పరిగణలోకి తీసుకొని అక్టోబర్ 4వ తేది తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. ఈ గడువులో కొత్తగా ఓటరు నమోదయ్యేందుకు మాత్రమే అవకాశం కల్పించింది. ఫారం 7, 8 ద్వారా మార్పులు చేర్పులకు అవకాశం ఇవ్వలేదు. ఫారం 6 తో ఆన్‌లైన్‌లో గానీ, నేరుగా బూత్ లెవల్ అధికారుల ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపింది. అక్టోబర్ 4న విడుదలైన ఓటరు జాబితా పోలింగ్ కేంద్రాల వారీగా ఉండగా ఇప్పుడు కొత్త ఓటర్లు 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఈ నెల 31వ తేదీ వరకు ఆధార్ కార్డు, వయస్సు , ధ్రువీకరణ పత్రం అందజేస్తే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకునే సువర్ణ అవకాశాన్ని పొందుతారు.

### ఇంకా ఆరు రోజులే గడువు

జిల్లాలో ఓటర్ల నమోదుకు కేవలం ఆరు రోజులు గడువు మాత్రమే మిగిలింది. ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవగాహన కల్పించింది. ఎన్నికలు జరిగే ప్రతీసారి ఓటు శాతం పెంచడం కోసం సంబంధిత అధికారులు ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇందులో భాగంగానే ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు అవకాశం కల్పి స్తుంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని. ఓటు వజ్రాయుధంతో సమానమని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తుంటారు.

### ఓటు వినియోగంపై విస్తృత ప్రచారం



అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న జరుగనున్నందున ఎన్నికల కమిషన్ ఈ నెల 31వ తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం ఇచ్చింది. ఈ అవకాశాన్ని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఓటరు నమోదు ఓటు హక్కు వినియోగంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయిస్తున్నారం. స్పెషల్ డ్రైవ్ సైతం నిర్వహించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటు నమోదు చేశారు. ఇప్పటికే ఓటరు తుది జాబితా విడుదల చేశాం.

- కోమల్ రెడ్డి, ఆర్డీవో


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# అనుమతి లేకుండా సెలవుపై వెళ్ల వద్దు

నిర్మల్ టౌన్, అక్టోబర్ 25 : నిర్మల్ జిల్లాలో ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు అనుమతి లేకుండా బయటకు వెళ్లవద్దని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులకు అదేశించారు. బుధవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై విధులు నిర్వర్తించే అధికారులు సిబ్బంది ఎన్నికల నిర్వహణను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోనే విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతిరోజూ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. అనుమతి లేకుండా అధికారులు బయటకు వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, మూత్రశాలలు, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# మక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మక్కజొన్న కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 25 : ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో భూమి అశన్న మాట్లాడుతూ మక్క జొన్న క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,090 చెల్లిస్తామని పేర్కొన్నారు. రైతు లు తమ వెంట పాస్‌బుక్, ఆధార్, భ్యాంక్ అకౌంట్ తీసుకొచ్చి మక్కజొన్నను విక్రయించాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సయ్యద్ అజమ్ అలీం, తుప్రాన్ శ్రీనివాస్, గంగయ్య, అశోక్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఖానాపూర్‌లో బతుకమ్మ సంబురాలు

ఖానాపూర్, అక్టోబర్ 25 : ఖానాపూర్‌లో గురువారం సద్దుల బతుకమ్మ సంబురాలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మహిళలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేయించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అదేశించారు. బతుకమ్మలను సాయినగర్ కెనాల్, గోదావరి వద్ద నిమజ్జనం చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేందర్

# అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఖానాపూర్, అక్టోబర్ 25 : ఖానాపూర్ నియోజకవర్గ అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఖానాపూర్‌లోని ఇంద్రానగర్ కాలనీలోని అంబేద్కర్ సంఘం భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అర్ల రమేశ్, ముఖ్య సలహాదారుడిగా నేత శ్యాం, కన్వీనర్‌గా మునుగురి ప్రణీత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ అశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రంజిత్, ఉపాధ్యక్షుడు రాసమొల్ల అశోక్, బద్దన్న, శైలేందర్, రాజేందర్, మహిపాల్, రాజ్‌కుమార్, సాయి, రాజన్న, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# పోలీసుల విస్తృత తనిఖీలు

ఖానాపూర్, అక్టోబర్ 25 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఖానాపూర్ నియోజకవర్గంలో పోలీసులు, ఉన్నతాధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇందులో బాగంగా బుధవారం ఖానాపూర్–తర్లపాడు జాతీయ రాహదారిపై వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, సరైన పత్రాలు లేకుండా రూ. 50 వేలకు పైగా నగదును కలిగి ఉండొద్దని సూచించారు. ఏఎస్ఐ రాంచందర్, పీసీ రాజేశ్వర్, సిబ్బంది పోశెట్టి తదితరులున్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు, ప్రత్యేక అధికారులు

## బీఆర్ఎస్ హైటెక్ ప్రచారం


ప్రచారాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 25 : బీఆర్ఎస్ పార్టీ గ్రామాల్లో హైటెక్ ప్రచారం చేపట్టింది. ఎల్ఈడీ ప్రొజెక్టర్ ద్వారా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పలు గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల తరపున ప్రచార వాహనాలు ప్రొజెక్టర్, బీఆర్ఎస్ ఫ్లెక్సీలతో పర్యటిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రచారం వాహనం అడవిసారంగాపూర్ గ్రామానికి వచ్చింది. ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని వివరిస్తున్నారు